క్లుప్తంగా

శిక్షా సప్తాహ్‌పై శిక్షణ



కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో వెంకటరావు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)లో భాగంగా ఈ నెల 22 నుంచి 28 వరకు శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు వారం రోజుల పాటు నిర్వహిస్తారు. దీనిలో భాగంగా సోమవారం జరిగిన కార్యక్రమానికి ములగాడ ఎంఈవో–2 ఎల్.వెంకటరావు హాజరై వివిధ తరగతుల వారు ప్రదర్శించిన నమూనాలను తిలకించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరికృష్ణ, ఇతర ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సకాలంలో వినతుల పరిష్కారం



వినతులు పరిశీలిస్తున్న జెడ్సీ హైమావతి

పెందుర్తి: వేపగుంటలోని జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై 5 వినతులు అందాయి. జోనల్ కమిషనర్ హైమావతి ఆయా వినతులను స్వీకరించి సంబంధిత అధికారులకు అప్పగించారు. గడువులోగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి వస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. ఆమె పెదగదిలిలోని క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించడం వల్ల విశాఖ నగరంలో కాలుష్య నియంత్రణ సాధ్యమవుతుందన్నారు.

గోధుమపిండి టెండర్లలో అవకతవకలు

- రద్దు చేయాలని మిల్లర్ల డిమాండ్

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గోధుమ పిండి కోసం దాఖలైన షార్ట్ టెండర్లను సోమవారం రహస్యంగా తీసి, పాత వారికే కట్టబెట్టారని ఏపీ రోలర్ ఫ్లోర్ మిల్ అసోసియేషన్ నాయకులు ఆరోపించారు. ఈ టెండర్లు దాఖలు చేసిన వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సోమవారం అమరావతి సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండీ కార్యాలయంలో రహస్యం టెండర్లు తెరిచారని, దీని వల్ల తాము ఎంతో నష్టపోయామని అసోసియేషన్ నాయకులు విశాఖలోని పేర్కొన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం నాయకులు దృష్టి సారించి, టెండర్ల అవకతవకలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

డివైడర్‌పై వాహనాల పార్కింగ్



సుసర్ల కాలనీ వద్ద శిథిలమైన డివైడర్



సీతారామరాజునగర్ వద్ద డివైడర్‌పై పార్క్ చేసిన వాహనాలు

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్‌ఈబీ కాలనీ, సీతారామరాజునగర్, సుసర్ల కాలనీ మీదుగా ఉన్న 80 అడగుల రహదారిలో డివైడర్ కళా విహీనంగా మారింది. డివైడర్‌పై వాహనాల పార్కింగ్ చేయడంతో పూర్తిగా శిథిలమైపోయింది. ఈ డివైడర్‌ను అభివృద్ధి చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయాజనం లేక పోయిందని స్థానికులు చెబుతున్నారు. ఎన్‌ఏడీఎల్ గేటు వద్ద రహదారిని విస్తరించే సమయంలో బాగు పడుతుందని అందరూ ఆశించినా ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదు. డివైడర్‌పై వాహనాల పార్కింగ్‌కు చెక్ పెట్టడంతో పాటు అభివృద్ధి చేసి ఆహ్లాద కరమైన మొక్కలు వేయాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

కూలిన రక్షణ గోడ

- వారం రోజుల వ్యవధిలో రెండో సారి
- కలవర పడుతున్న కొండవాలు ప్రాంత ప్రజలు



హనుమాన్‌సంజీవ్‌కాలనీ కొండ ప్రాంతంలో కూలిన రక్షణ గోడ

మల్కాపురం: ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొండ వాలు ప్రాంతంలో రక్షణ గోడలు కూలుతున్నాయి.దీంతో ఆ ప్రాంత వాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే ప్రాంతంలో వారం రోజుల వ్యవధిలో రెండో సారి రక్షణ గోడ కూలడంతో ఆ ప్రాంత వాసులు రాత్రులు ఆ ప్రాంతంలో ఉండేందుకు భయపడుతున్నారు. 60వ వార్డు పరిధి హనుమాన్‌సంజీవ్‌కాలనీ కొండ ప్రాంతంలో సోమవారం రక్షణ గోడ కూలింది. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కొండ ప్రాంతంలో రక్షణ గోడల దిగువ మట్టి కరుగుతోంది. దీంతో గోడలు కూలుతున్నాయి. సోమవారం ఉదయం కూలిన గోడ దిగువ ఇళ్లపై పడడంతో ఆ ఇంటి శ్లాబ్ పై పడడంతో పెద్ద శబ్దం వచ్చింది. దీంతో ఆ ఇంటి వారు ఉరుము ఏమైనా పడిందా అని కలవరం చెందారు. ఇదే కాలనీలో గత శనివారం కూడా రక్షణ గోడ కూలింది. ఈ ఘటనలో శిథిలాల కింద రెండు ద్విచక్ర వాహనాలు చిక్కుకున్న సంగతి తెలిసిందే. అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలకు తావులేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

నాయకుల సందర్శన

విషయం తెలుసుకున్న వార్డు టీడీపీ నాయకుడు మాత శ్రీను ఆ ప్రాంతానికి కార్యకర్తలతో వెళ్లి శిథిలాలను తొలగించే విధంగా చర్యలు తీసుకున్నారు. ములగాడ మండల రెవెన్యూ అధికారుల దృష్టికి సమస్యను తీసుకు వెళ్లారు.

కార్మిక శాఖ మంత్రి దృష్టికి సమస్యలు



కార్మిక శాఖ మంత్రిని సత్కరిస్తున్న ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు

సింధియా: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు సోమవారం కలిసి ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. యూనియన్ అధ్యక్షుడు సబ్బం కిరణ్, ప్రధాన కార్యదర్శి ఉడతా అప్పలరాజు నాయకత్వంలో కలిసిన ప్రతినిధులు ఓటీపై హెచ్‌ఆర్ లెక్కకట్టి ఇవ్వాలని, కోర్టు కేసులు ఇంప్లిమెంట్ చేయాలని, డెయిలీ వేజ్ కార్మికులను రెగ్యులైజేషన్ వంటి అంశాలపై చర్చించారు. అనంతరం కార్మిక మంత్రిని సత్కరించి మెమొంటో అందజేశారు. మంత్రిని కలిసిన బృందంలో యూనియన్ ఉపాధ్యక్షులు ఎం.వై.ప్రసాద్‌బాబు, పి.సాయికుమార్, పి.సునీల్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.రమేష్, అసిస్టెంట్ సెక్రటరీ జి.వెంకటేష్, వి.గణేష్, పి.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీరు రోడ్డు పైకి..



కాలువలో నిలిచిపోయిన వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు రామ్‌నగర్, శ్రీహరిపురం ప్రాంతాల్లో వీధి కాలువలు పూడుకు పోయాయి. వ్యర్థాలు భారీగా చేరడంతో మురుగు నీరు రోడ్డుపైకి వచ్చేసింది.దీంతో ఆ ప్రాంత వాసులు ఇబ్బంది పడ్డారు.

ఇదీ పరిస్థితి

వర్షాలకు వరద నీరు ఎగువ నుంచి రావడంతో ఆయా ప్రాంతాల్లోని కాలువల్లో వ్యర్థాలు,ప్లాస్టిక్ కవర్లు అడ్డంగా నిలిచాయి. దీంతో వర్షపు నీరు పోయే మార్గం లేక కాలువల్లో మురుగు, వ్యర్థాలు సోమవారం రోడ్డు పైకి వచ్చింది. దీంతో ఆయా ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సమస్య అధికారుల దృష్టికి వెళ్లడంతో సిబ్బంది వచ్చి రోడ్డుపైకి వచ్చిన వ్యర్థాలను తొలగించారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



గణేశ్వరరావు(ఫైల్)

గోపాలపట్నం: జీవితంలో స్థిరపడలేదన్న మనస్తాపంతో యువకుడు ఉరి వేసుకుని మృతి చెందాడు. జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్‌లో చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి గోపాలపట్నం సీఐ సురేష్ తెలిపిన వివరాలు.. కడలి గణేశ్వరరావు (31)తల్లి దండ్రులతో చంద్రనగర్‌లో నివాసముంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో మొదటి అంతస్తులో నిర్మాణంలో ఉన్న ఇంట్లో హుక్కుకు చీరతో ఉరి వేసుకుని మృతి చెందాడు. తల్లి సుబ్బలక్ష్మి చూసి ఆందోళకు గురయింది. కుటుంబసభ్యులు, స్థానికుల సహాయంతో కిందకు దించారు. గణేశ్వరరావుకు ఉద్యోగం లేదని రెండు మూడు సంబంధాలు తప్పిపోవడంతో మనస్తాపానికి గురై ఉరి వేసుకుని మృతి చెందాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. మృతుడికి తల్లి తండ్రి, అన్న వదిన ఉన్నారు. ఘటనా స్థలానికి సీఐ సురేష్, ఎస్‌ఐ రామకృష్ణ వెళ్లి మృతికి గల కారణాలు సేకరించారు. మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. అన్న సాంబశివరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో బోధనకు నూతన ప్రణాళిక



మాట్లాడుతున్న ఆర్జేడీ విజయ్‌భాస్కర్

ఆర్జేడీ విజయ్‌భాస్కర్

పెందుర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో బోధనలో నాణ్యత పెంచే దిశగా నూతన ప్రణాళికను అమలు చేస్తున్నామని ఆర్జేడీ బి.విజయ్‌భాస్కర్ అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమలో ఉన్న మేధాశక్తిని మరింతగా ఉపయోగించి పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయాలని సూచించారు. బోధన నిరంతర ప్రక్రియ అని..విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించేందుకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలన్నారు. పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చసిన అభ్యసన సామగ్రిని తిలకించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణ తరగతులను సందర్శించి ఉపాధ్యాయులకు తగిన సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ న్యాయమూర్తి వెంకటశేషమ్మ, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కె.సువర్ణ, ఎంఈవో–2 మధుమూర్తి, జిల్లా సమగ్ర శిక్ష సహాయ ఏ.ఎం.వో జి.లక్ష్మి, జీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సి.హెచ్ చిన్మయి, టీచ్ టూల్ ప్రోగ్రాం జిల్లా కో ఆర్డినేటర్ ఎస్.పూర్ణచంద్ర, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 10 కిలోల గంజాయి పట్టివేత



గంజాయి రవాణాదారులతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో సోమవారం గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో పలు ప్లాట్‌ఫారాల్లో సోమవారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్‌ఐ జేకే మీనా, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. పలువురు లగేజీలను తనిఖీ చేసే సమయంలో రాజస్థాన్‌కు చెందిన నందకిషోర్, శ్రీరామ్ బిజార్నియాలు అక్రమంగా గంజాయిని తరలించడం గుర్తించారు. వీరి వద్ద నుంచి సుమారు రూ.50 వేల విలువైన 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని సీజ్ చేసి, నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

ఏఎన్ 32 విమాన ప్రమాద మృతులకు నివాళి



విమాన ప్రమాద మృతులకు నివాళులర్పిస్తున్న ఎన్‌ఏసీఈడబ్ల్యూ యూనియన్ సభ్యులు

గోపాలపట్నం: నేవల్ ఆర్మమెంట్ డిపో మెయిన్ గేటు వద్ద నేవల్ ఆర్మమెంట్ సివిలియన్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియల్ నాయకులు ఏఎన్ 32 విమాన ప్రమాదంలో మృతి చెందిన వారి చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ 12 జులై 2016 న ఎన్‌ఏడీ ఉద్యోగులు ఏఎన్ 32 విమానంలో ప్రయాణిస్తూ 8 మంది ప్రమాదానికి గురయ్యారని గుర్తు చేశారు. మృతుల కుటుంబాలకు ఎన్‌ఏసీఈడబ్ల్యూ యూనియన్ అండగా నిలబడిందని తెలిపారు. అంతే కాకుండా వర్క్‌మెన్ కాంపెన్సేషన్ యాక్ట్ 1923ప్రకారం రావాల్సిన పరిహారం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. అతిత్వరలో డిపార్ట్‌మెంట్, రాష్ట్ర లేబర్ కమిషన్ ద్వారా అందిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఆదుకునేందుకు రాష్ట్ర ఎంపీలు, రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పాటుపడాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, అధ్యక్షుడు కె.సత్యనారాయణరావు కోరారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల నేతృత్వంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1257వ రోజు, సోమవారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించేలా స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ఎంపీలందరూ గళం విప్పాలన్నారు. విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, పూర్తి సామర్థ్యంతో ఉక్కు ఉత్పత్తి సాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీక్ష శిబిరంలో విశాఖస్టీల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు కూర్చున్నారు. నాయకులు కె.రాజబాబు, మసేనురావు, నరేష్‌కుమార్, డొక్కా నరసింగరావు, జి.జయ, శివరామకృష్ణ, తాండ్ర కనకరాజు, చీకటి శ్రీనివాస్, ఎం.ఎం.ఎల్.నాయుడు, వివిధ యూనియన్ల నాయకులు యు.రామస్వామి, వరసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన భారీ వృక్షం

- తప్పిన పెను ప్రమాదం
- కారు, దుకాణాలు ధ్వంసం



ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద రోడ్డుకు అడ్డంగా కూలిన భారీ వృక్షం



కూలిన చెట్టు కింద నుజ్జయిన కారు

మద్రిపాలెం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా 53వ వార్డు ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద సోమవారం ఉదయం ఓ భారీ వృక్షం నేలకొరిగింది. అక్కడే సమీపంలో ఉన్న ఓ కారుపై, ఓ ఇంటి రక్షణ గోడపై ఆ చెట్టు కూలిపోవడంతోపాటు టీ స్టాల్, దుకాణాలు, విద్యుత్ స్తంభాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అప్పుడే టీ స్టాల్ తెరవడానికి వచ్చిన బాధితుడు ఎల్లారావు పెద్ద ప్రమాదమే తప్పిందని, ఈ ఘటనలో తన షాపు పడిపోయిందని వాపోయాడు. రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలో జనసంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై విద్యుత్ విభాగ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ ఘటనా స్థలాన్ని పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. కూలిన చెట్టును తక్షణం తొలగించాలని అధికారులకు కార్పొరేటర్ పలు సూచనలిచ్చారు.

'కిల్కారీ'తో తల్లీబిడ్డల ఆరోగ్యం

- డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు
- కిల్కారీ వాయిస్ కాల్స్‌పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్ లంకపల్లి రాజు, చిత్రంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: తల్లీబిడ్డల ఆరోగ్యానికి కిల్కారీ సేవలు దోహదపడుతున్నాయని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. రేసపువానిపాలెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) కార్యాలయంలో పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న ఆశా, నోడల్ అధికారులకు సోమవారం కిల్కారీ మొబైల్ అకాడమీ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా, శిశు మరణాల నియంత్రణే లక్ష్యంగా కిల్కారీ సేవలు వినియోగిస్తున్నామన్నారు. ఈ వాయిస్ కాల్స్ సేవలతో తల్లీ శిశు ఆరోగ్యానికి భద్రత కలుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై భారత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేస్తూ కిల్కారీ పేరిట వాయిస్ కాల్స్ వచ్చేలా ప్రభుత్వం రూపకల్పన చేసిందని డీఎంహెచ్‌వో వివరించారు.

స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ లంకపల్లి రాజు మాట్లాడుతూ గర్భిణిగా స్థానిక ఏఎన్ఎం దగ్గర వివరాలు నమోదు చేసుకున్న సమయంలో ఇచ్చిన మొబైల్ నంబర్‌కు ఈ కిల్కారీ వాయిస్ కాల్స్ వస్తాయన్నారు. గర్భిణుల్లో తలెత్తే ఎన్నో సందేహాలను నివృత్తి చేసే విధంగా ఈ వాయిస్ కాల్ సందేశం ఉంటుందన్నారు. నాలుగు నెలల గర్భిణి నుంచి పాలిచ్చే తల్లుల వరకు, బిడ్డకు ఏడాది వయస్సు వచ్చే వరకు 72 సార్లు వాయిస్ కాల్స్ సందేశాలు వచ్చేలా కిల్కారీ కార్యక్రమాన్ని డిజైన్ చేశారని చెప్పారు. ఈ కాల్ సమయం సుమారు 1.30 నిమిషాలు ఉంటుందని, ప్రతి గర్భిణి పూర్తిగా వినడానికి ప్రయత్నించాలని సూచించారు. ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో నమోదు చేసిన ప్రతి గర్భిణికి 01244451660 నంబర్ నుంచి వాయిస్ కాల్ వస్తుందని, ఒక వేళ ఫోన్ ఎత్తడం మిస్ అయితే, ఐవీఆర్ సిస్టం ఆటోమేటిక్‌గా ఒకే రోజు 3 సార్లు ఫోన్ కాల్ వచ్చేలా చేస్తుందని రాజు వివరించారు. తిరిగి ఆ సందేశాన్ని వినాలి అనుకున్న వారు 14423 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేసి వినవచ్చునని చెప్పారు. మాతా శిశు ఆరోగ్య సంరక్షణ సేవలు అందించేందుకు మొబైల్ అకాడమీ కోర్స్‌ని 11 మాడ్యూల్స్ ద్వారా రూపకల్పన చేశారన్నారు. 14424 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేసి ఆశా కార్యకర్తలు ఈ కోర్సులో జాయిన్ కావొచ్చునన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రతి గర్భిణికి అవగాహన కల్పించే దిశగా ఆశా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎస్.జీవన రాణి, డాక్టర్ బి.ఉమావతి, కె.ప్రశాంత్, ఆర్.మోహనరావు, కె.ధర్మేంద్ర, ఐ.మనోరమ, శశి భూషణ్, మణికుమారి, నాగభూషణం పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన అవసరం

తగరపువలస : భీమిలి మండలం తాటితూరులో ప్రజలకు నగరానికి చెందిన జాతీయ విపత్తుల నిర్వహణ దళం సభ్యులు సోమవారం అవగాహన కల్పించారు. 10వ బెటాలియన్ టీమ్ కమాండర్ ఈశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, నివారణ చర్యలను వివరించారు. తుఫాన్లు, వరదలు, భూకంపాలు, పిడుగులు పడినప్పుడు, గ్యాస్, విష వాయువులు చిమ్మినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో భీమిలి తహసీల్దార్ టి.గోవింద్, సర్పంచ్ శిరిగుడి సంతోషి పాల్గొన్నారు.

సన్మార్గం వైపు నడిపేది సాహిత్యం



సుగుణరావును సత్కరిస్తున్న డాక్టర్ కూటికుప్పల సూర్యారావు

సీతంపేట: సమాజాన్ని సన్మార్గపు జీవనశైలి వైపు తిప్పగల శక్తి సాహిత్యానికి ఉందని పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు. మక్కెన రామ సుబ్బయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో దశమ సాహితీ పురస్కారాల సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ పూర్వకాలంలో రాజులు కవులను, రచయితలను ప్రోత్సహించేవారన్నారు. ప్రస్తుత కాలంలో డాక్టర్ మక్కెన వంటి సాహితీ పోషకులు కవులను, రచయితలను పురస్కారాలతో గౌరవిస్తున్నారని అభినందించారు. విశిష్ట అతిథి వి.రాజారామ్మోహన్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆంగ్ల భాష మోజులో పడి తల్లిదండ్రులు తెలుగు భాషను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తేనె కంటె తీయనైన తెలుగు భాష పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సాహిత్య పురస్కారాలకు ఎంపికైన డాక్టర్ ఎం.సుగుణరావు, లేదాళ్ల రాజేశ్వరరావు, బండారు రాజ్‌కుమార్, కొమ్ముల వెంకట సూర్యనారాయణ, ముని సురేష్‌లను ఘనంగా సత్కరించారు.